మల్కాజిగిరి ప్రగతికి నిరంతరం కృషి చేస్తా..

స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్



ఎన్నికల ప్రచారంలో వైష్ణవీ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైష్ణవీ ప్రసాద్

నాగోలు: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర ఎంపీ అభ్యర్థి పెండ్యాల శేషసాయి వర ప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. బుధవారం ఆయన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎల్‌బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, బాలానగర్, రాజు కాలనీ, కీసర, మేడ్చల్, కంటోన్మెంట్‌ల్లోని వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తాను మల్కాజిగి ఎంపీగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ఎంపీగా తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి ఇంటి సంక్షేమం, పేదల కోసం, ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. పార్లమెంట్ పరిధిలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంతో పాటు యువకుల కోసం నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. మహిళల అభివృద్ధి, భద్రత, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజవర్గంలో తాను చేపట్టిన పలు సేవ కార్యక్రమాలను కాలనీ వాసులకు వివరించారు. మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రతి అంశానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు వైష్ణవీ ప్రసాద్‌కు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో దుడ్డు సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, మంగపతిరావు, దర్శనం శర్మ, ఆలూరి, గొల్లపూడి రాజేశ్వరరావు, మంగు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఫోకస్



అజంపురాలో ఇమాద్ స్కూల్ పోలింగ్ స్టేషన్

చాదర్‌ఘాట్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఈనెల 13న ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు చాదర్‌ఘాట్ పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల అధికారులు ఇచ్చిన నివేదికలను క్రోడీకరించి చాదర్‌ఘాట్ స్టేషన్ పరిధిలో అల్లర్లకు ఆస్కారం ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో 58 పోలింగ్ బూత్‌లు ఉండగా, అందులో 22 సమస్యాత్మకమైనవిగా గుర్తించి పటిష్ట బందోబస్తుకు రూపకల్పన చేశారు. ప్రతీ సమస్యాత్మక పోలింగ్ కేంద్రం వద్ద సెంట్రల్ ఫోర్స్ బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో అనుమానితుల కదలికలపై దృష్టి సారించారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌లో ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే వెంటనే పోలీస్ ఫోర్స్ అక్కడికి చేరుకునేలా మ్యాప్‌ను సిద్ధం చేశారు.

అనుమానితుల కదలికలపై నిఘా..



ప్రతీ పోలింగ్ లొకేషన్ పరిధి లోనూ అనుమానితుల కదలికలపై ఇప్పటికే దృష్టి సారించాం. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడ్డుకట్ట వేసేందుకు నిత్యం నిఘా కొనసాగుతోంది.

– చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సైదులు

సరూర్‌నగర్ చెరువు మరింత అభివృద్ధికి కృషి



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి

లింగోజిగూడ: రాబోయే రోజులలో సరూర్‌నగర్ చెరువును మరింత అభివృద్ధి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సరూర్‌నగర్ చెరువు ప్రియదర్శిని పార్క్‌లో బీఆర్ఎస్ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని వాకర్స్‌ను కోరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రియదర్శిని పార్క్‌ను సందర్శకులను ఆకట్టుకునే విధంగా తాను తీర్చిదిద్దానని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసేందుకు సాధ్యమవుతుందని అన్నారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్, కుమార్, టింకు, ఆశిశ్, రవి, శ్రీధర్ పాల్గొన్నారు.

జీఎస్ఐ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా..

నూతన ఏడీజీ డాక్టర్ లలన్‌ప్రసాద్‌సింగ్

మన్సూరాబాద్: జీఎస్ఐ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సదరన్ రీజియన్ ఇన్‌చార్జి ఏడీజీ డాక్టర్ లలన్‌ప్రసాద్‌సింగ్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధి బండ్లగూడలోని జీఎస్ఐ కార్యాలయంలో బుధవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉద్యోగులు నూతన ఏడీజీకి బొకేతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. నూతన ఏడీజీ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ క్రమశిక్షణతో జీఎస్ఐ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు ఆనంద్‌కుమార్, అమర్నాథ్, చక్రేశ్వర్, మేఘరాజ్, విజయలక్ష్మి, యాదగిరి, దయానంద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అన్నదానం



మలక్‌పేట: సామాజిక సేవ కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం ఎంతో సంతృప్తి ఉంటుందని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం దిల్‌సుఖ్‌నగర్ కార్యాలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రొద్దటూరి రవీందర్, ఉపాధ్యక్షుడు తోట వెంకయ్య, పాల మధుసూదన్, బి.నిర్మలేష్, జనరల్ సెక్రటరీ రామనాథం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షకులకే ఓటెయ్యాలి

మఠాధిపతుల సమావేశంలో స్వామీజీలు



విలేకరుల సమావేశంలో మాట్లాడతున్న స్వామీజీలు

సైదాబాద్: సనాతన హిందు ధర్మ పరిరక్షణకు పాటుపడే వ్యక్తులకు, పార్టీలకే హిందువులు ఓటెయ్యాలని విజయవాడ కేశరపల్లె భువనేశ్వర పీఠానికి చెందిన శ్రీకమలానంద స్వామీజీ పిలుపునిచ్చారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని శ్రీవిజయ వినాయక దేవాలయం హాల్‌లో రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు మఠాలకు చెందిన స్వాములతో కలిసి మాట్లాడారు. ఇటీవల కాలంలో హిందూ సనాతన ధర్మంపై దాడులు ఎక్కువ అవుతున్నాయని, వాటిని తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో శ్రీకాంతేంద్ర స్వామీజీ, శ్రీశివపార్వతి మాతాజీ, ఆదిభట్ల కళాపీఠం అధ్యక్షురాలు కరాటే కల్యాణి, వీరధర్మ స్వామీజీ, వానరసేన జాతీయ అధ్యక్షుడు రామిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం పవిత్రమైంది



కార్యక్రమంలో పాల్గొన్న ఆకృతి సుధాకర్, శంకర్ తదితరులు

ఎల్‌బీనగర్: అన్ని దానాల్లో రక్తదానం ఎంతో పవిత్రమైందని ఆకృతి సంస్థ అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. మదర్ థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లో బుధవారం నిర్వహించిన ప్రపంచ రెడ్ క్రాస్ డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే ఎక్కడ రక్తం కావాలన్నా రక్తం అందించే సంస్థగా రెడ్ క్రాస్ సంస్థ పేరు గాంచిందని అన్నారు. రక్తం కావాల్సిన వారికి మదర్ థెరిస్సా సంస్థ రక్తం అందించడం గొప్ప విషయమని, సంస్థ చైర్మన్ శంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో శంకర్, రాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వాన నీటి నిల్వతో వాకర్ల ఇబ్బందులు



వాకింగ్ ట్రాక్‌పై నిలిచిన వాన నీరు

సాక్షి, సిటీ బ్యూరో: నగరంలో మంగళవారం కురిసిన వర్షానికి కొత్తపేటలోని శ్రీరామలింగేశ్వర కాలనీలోని తెలంగాణ పార్కు వాన నీటితో నిండిపోయింది. వాకింగ్ ట్రాక్ మొత్తం వర్షపు నీరు నిలిచిపోవడంతో వాకర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం వేళ సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత, పిల్లలు వాకింగ్ చేయలేక ఇబ్బందులకు గురయ్యారు. చిన్నపాటి వర్షానికే పార్కు పరిస్థితి ఇలా ఉంటే.. ముందు ముందు ఎలా ఉంటుందోనని పలువురు వాకర్లు వాపోయారు. స్థానిక మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి పార్కులో నీరు నిల్వకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాల అమలు

మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సునీతామహేందర్‌రెడ్డి, వేదికపై మధుయాష్కీగౌడ్

నాగోలు: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వారు నాగోల్ డివిజన్‌లోని రాజీవ్ స్వగృహ బీ బ్లాక్ లో కాలనీ వాసులతో సమావేశమయ్యారు. మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో...

మన్సూరాబాద్: టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మన్సూరాబాద్‌లోని ఇందిరానగర్, గణేష్‌నగర్‌కాలనీ, జడ్జెస్‌కాలనీ, శుభోదయకాలనీ, విజయశ్రీకాలనీ, సాయినాథ్‌కాలనీల్లో కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

గడ్డి అన్నారం డివిజన్‌లో...

చైతన్యపురి: సునీతా మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ గడ్డిఅన్నారం డివిజన్‌లోని పలు కాలనీల్లో డివిజన్ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రాహుల్ సభను జయప్రదం చేయండి

చైతన్యపురి: సరూర్‌నగర్ స్టేడియంలో గురువారం నిర్వహించే రాహుల్ గాంధీ జనజాతర సభను జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. బుధవారం వారు చైతన్యపురిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు.

రాహుల్ సభను విజయవంతం చేయాలి: దేప



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్లమెంట్ అభ్యర్థులకు మద్దతుగా గురువారం సాయంత్రం 5 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం ఆర్‌కేపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించే ప్రచార సభలో రాహుల్‌గాంధీ పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణాపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ నేత, బొడ్డుపల్లి మహిందర్, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్



ఓటు వేసిన ఎల్‌బీనగర్ సహాయ ఎన్నికల అధికారి పంకజ

ఎల్‌బీనగర్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌తో పాటు హోం ఓటింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పోలీసులు, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు 5300 మంది ఎల్బీనగర్ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో బుధవారం సాయంత్రం వరకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సుమారు 4063 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1027 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇక ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వృద్ధులు, దివ్యాంగులు 213 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇందులో 204 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. 9 మంది వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోలేదని అధికారులు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేసి వృథా చేసుకోవద్దు

మళ్లీ మోదీనే ప్రధాని: ఈటల



కాపుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఎల్‌బీనగర్: రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేస్తే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని రేవంత్ రెడ్డి చెప్తున్నారని, ఆయన ప్రధాని అయ్యేదిలేదు.. ఈయన చేసేది లేదని, కాంగ్రెస్‌కు ఓటు వేసి వృథా చేసుకోవద్దని బీజేపీ మల్కాజిరిగి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మరోసారి దేశ ప్రధాన మంత్రిగా మోదీనే అవుతారని ఆయన అన్నారు. వనస్థలిపురంలో బుధవారం నిర్వహించిన కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఈటల రాజేందర్ హాజయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్కాజిగిరిలో రోడ్‌షో నిర్వహించిన మోదీ... ఎంపీగా గెలిచి రండి. ప్రజలకు అన్ని పనులు చేసి పెడతానని నాకు హామీ ఇచ్చారని అన్నారు. మూసీ నది ప్రక్షాళన చేయించే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఈటల హామీ ఇచ్చారు. తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ,బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాపు సంఘం నాయకులు అంజిరావు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజలందరికీ భద్రత

చైతన్యపురి: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజలందరి భద్రతకు భరోసా లభిస్తుందని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ఆయన డివిజన్‌లోని సాహితీనగర్, న్యూ గడ్డిఅన్నారం, గౌతంనగర్, మైత్రినగర్, కాలనీల్లో బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు..

బీజేపీతోనే దేశాభివృద్ధి...

నాగోలు: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. బుధవారం కొత్తపేట డివిజన్ గాయత్రిపురం కాలనీలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

మన్సూరాబాద్: కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని చిత్రసీమకాలనీ, జడ్జెస్ కాలనీ, శుభోదయ కాలనీ, విజయశ్రీకాలనీ, వివేకానందనగర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈటల గెలుపు ఖాయం:

తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కమిషన్లతో ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త నరహరి వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. మన్సూరాబాద్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమన్నారు.

మూత్ర విసర్జనకు వెళ్లి.. మృత్యు ఒడికి...



శివశంకర్ మృతదేహం

హయత్‌నగర్: మూత్ర విసర్జన కోసం వెళ్లిన ఓ బాలుడికి విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. బుధవారం హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు చెందిన ఆలకుంట జములయ్య ఆటోలో చెత్త సేకరణ చేస్తూ హయత్‌నగర్‌లోని ముదిరాజ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతనుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం ఎప్పటిలాగే భార్యతో కలిసి చెత్త సేకరణకు బయలుదేరాడు. స్కూల్‌కు సెలవులు కావడంతో పిల్లలు కూడా వారితో ఆటోలో వెళ్లారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని సన్‌రైజ్ కాలనీలో జములయ్య భార్య ఇళ్లలో చెత్తను సేకరిస్తుండగా, ఆటోలో ఉన్న వారి కుమారుడు శివశంకర్(5) కిందికి దిగి మూత్ర విసర్జన కోసం బహిరంగ ప్రదేశానికి వెళ్లాడు. అక్కడే తెగి పడి ఉన్న కరెంట్ తీగ బాలుడి కుడి కాలుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం కురిసిన గాలి వానకు విద్యుత్ తీగ తెగి పడి ఉంటుందని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల బాలుడు చనిపోయాడని అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ కన్వీనర్ బీజేపీలో చేరిక



నవనీత్ కౌర్ సమక్షంలో బీజేపీలో చేరిన శంకరాచారి

సైదాబాద్: ఎన్నికల వేళ పాతబస్తీలో బీఆర్ఎస్‌కు ఎదురు దెబ్బలు తగుతుతున్నాయి. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, యాకుత్‌పురా నియోజకవర్గ బీఆర్ఎస్ కన్వీనర్ శంకరాచారి బీజేపీ కండువా కప్పుకున్నారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్‌లో నిర్వహించిన యువమోర్చా సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఎంపీ నవనీత్ కౌర్ సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సమగ్రాభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమవుతుందన్నారు. అందుకే తన మాతృ పార్టీలో తిరిగి చేరానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మలక్‌పేట: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. మూసారంబాగ్ పీవీఆర్ మాల్ సబ్‌రోడ్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి(50) అపస్మారక స్థితిలో ఉన్నాడని ఉదయం 9 గంటలకు స్థానికులు 108 అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.